ఖరీఫ్ రైతులకు సాగునీటి కష్టాలు

- 200 ఎకరాల్లో ముదురుతున్న నారు
- 250 క్వింటాళ్ల విత్తనాలు కొనుగోలు
- 6,500 ఎకరాల్లో సాగు



రెండురోజుల క్రితం వెంకటాపురం సుంకరవారితోటలో సాగునీటి కోసం ఆందోళన చేస్తున్న రైతులు





సాగునీరు లేక గుర్రపుడెక్కతో నిండిన ఏలూరులో కృష్ణ కెనాల్, మల్కాపురంలో రైతులు పోసిన నారు

ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ గ్రామాల్లో ఖరీఫ్ సాగుపై రైతుల్లో ఆందోళన నెలకొంది. జూలై నెల ప్రారంభమై రెండువారాలు గడుస్తున్నా కృష్ణా డెల్టాకు సాగునీరు విడుదల కాలేదు. దీంతో సాగు యత్నాలు ముమ్మరం చేయాలా వద్దా అనే అయోమయం రైతన్నల్లో ఏర్పడింది. మరోపక్క సాగునీటి విడుదలపై ప్రభుత్వం, అధికారులు ఎలాంటి ప్రకటనలు చేయడం లేదు. రైతులు ఆందోళన బాట పడుతున్నారు.

ముదురుతున్న వరినారు

మల్కాపురం, చొదిమెళ్ల, వెంకటాపురం, పోణంగి, చాటపర్రు, శనివారపుపేట, సత్రంపాడు, జాలిపూడి, మాదేపల్లి, లింగారావుగూడెం, బాబూఖాన్ గూడెంతో పాటు పలు శివారు గ్రామాల్లో రైతులు సుమారు 200 ఎకరాల్లో నారు పోశారు. ఇందుకోసం మొత్తంగా రూ.8 లక్షలు వెచ్చించి 250 క్వింటాల విత్తనాలు కొనుగోలు చేశారు. ఇప్పటి వరకు అడపదడప కురుస్తున్న వర్షాలతో నారు కాపాడుకుంటున్నారు. ఇప్పటికే నారు పోసి రెండు వారాలు కావస్తోంది. మరో రెండు వారాలు ఆగితే నారు ముదురుపోతోంది. దీంతో రైతుల్లో ఆందోళన పెరుగుతోంది.

సాగు పనులు ఆలస్యం

మండలంలో సుమారు 6500 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నట్టు అధికారులు భావిస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు ఎక్కువగా కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించడంతో కొన్ని గ్రామాల్లో రైతులు జూలై మొదట వారంలోనే దుక్కిదున్నారు. ఎకరానికి రూ.2 వేలు చొప్పున ఖర్చు చేశారు. అయితే సాగునీరు విడుదల ఆలస్యం కావడంతో కొన్ని ప్రాంతాల్లో రైతులు దుక్కు పనులు నిలిపివేశారు. కృష్ణా, గోదావరి కాలువకు ఏలూరు రూరల్ మండల శివారున ఉండడంతో ఏటా సాగు పనులు ఆలస్యంగా ప్రారంభమవుతున్న సంగతి తెలిసిందే. కాని ఈ ఏడాది ఈ ఆలస్యం మరింత పెరుగుతోంది. ఇక చేసేది ఏమీ లేక రైతులు నారు కాపాడుకునేందుకు తంటాలు పడుతున్నారు.

వర్షాలపైనే ఆధారం



ఖరీఫ్ కోసం విత్తనాలు కొనుగోలు చేశాం. మా గ్రామంలో రైతులు నారు పోసి ఇప్పటికే 10 రోజులు గడిచింది. నారు బాగా ముదిరిపోతే కష్టం. ఇప్పటి వరకు సాగునీరు విడుదల కాలేదు. వర్షం నీటితోనే నారు కాపాడుకుంటున్నాం. సాగునీరు వదిలితేనే మా గ్రామంలో ఖరీఫ్ పనులు ముమ్మరమౌతాయి.

– జి.దుర్గారావు, చాటపర్రు

నీటి విడుదలపై చర్చ



ఖరీఫ్ సాగు కోసం నీటి విడుదలపై జిల్లా అధికారులు చర్చిస్తున్నారు. మండలంలో సుమారు 200 ఎకరాల్లో రైతులు నారు పోశారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల నారు బాగానే ఉంది. మరింత ఆలస్యమైతే నారు ముదురుపోతుందని రైతులు అంటున్నారు. మరో రెండు వారాల వరకు నారుకు ఎలాంటి భయం లేదు. ఈలోగా ప్రభుత్వం నీరు విడుదల చేస్తుంది.

– ఎ.జీవనసంధ్య, ఎంఏఓ

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పవర్‌పేట సెక్షన్ పరిధిలో ఉన్న సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శనివారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు జేపీబీ నటరాజన్ తెలిపారు. వసంత్ మహల్ సెంటర్, పాత బస్‌స్టాండ్, పవర్ పేట, చిట్టివలస పాకలు, గూడ్స్‌షెడ్ రోడ్, పాండురంగాపురం, రామకృష్ణాపురం, విజయ గార్డెన్స్, మినీ బైపాస్ రోడ్డు, నెహ్రూ కాలనీ, గులాబీతోట, పడమర వీధి, కొబ్బరి తోట, గొల్లాయగూడెం, వంగాయ గూడెం, గ్రీన్ సిటీ,పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

- ఒన్‌టౌన్‌లోని కోటదిబ్బ సబ్ స్టేషన్ పరిధిలో వార్షిక మరమత్తుల నిమిత్తం అగ్రహారం, అంబికా సెంటర్, న్యూ మార్కెట్ ఏరియా, తుర్పు వీధి, మెయిన్ బజార్, టీచర్ కాలనీ, వెన్నవల్లివారిపేట, నవాబ్ పేట, సత్యనారాయణ పేట, బావిశెట్టివారి పేట, లంబాడి పేట, బెనర్జిపేట, కెనాల్ రోడ్ పరిసర ప్రాంతాలలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.
- అశోక్ నగర్ సబ్‌స్టేషన్‌లోని రామచంద్రరావు పేట, పత్తేబాద 4 గుడుల సెంటర్, పానుగంటి వారి వీధి, అతిథి హోటల్ రోడ్ శంకరమఠం, విజయ విహార్ సెంటర్, అమీనాపేట, అశోక్ నగర్, పత్తేబాద, మోతేవారితోట, దాసరి ఎర్రయ్యవీధి, నరసింహారావు పేట, పవర్ పేట, పోలీస్ క్వార్టర్స్, రంగూన్ మేడ రోడ్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

క్లుప్తంగా

హనుమాన్ చాలీసా పారాయణ



శ్రీ అభయాంజనేయ భజన సమాజం ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : స్థానిక సత్రంపాడు శ్రీ సౌభాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో వారాహి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం శ్రీచక్ర అభిషేకం చేసి అనంతరం సహస్రనామార్చన చేశారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం 6.30 గంటల నుంచి భక్తులచే సామూహిక కుంకుమ పూజలు నిర్వహించి పంచహారతులు సమర్పించారు. వేద మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. శ్రీ అభయాంజనేయ భజన సమాజం ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

ఎల్ఐసీ ప్రీమియంపై జీఎస్టీని రద్దు చేయాలి



ఎంపీకి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ఎల్ఐసీ ప్రీమియంపై జీఎస్టీని రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ, సాధారణ బీమా సంస్థలుగా ఉన్న నాలుగింటినీ ఒకే కంపెనీగా మార్చాలని కోరుతూ ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ ఏలూరు బ్రాంచి ఉద్యోగులు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. బీమా ప్రీమియంపై 8 శాతం జీఎస్టీ విధించడం వల్ల పాలసీదారులపై భారం పడుతుందని పేర్కొన్నారు. బీమా ప్రీమియంలకు కొత్త ఆస్తి పన్ను విధానంలో ఒక ప్రత్యేక సెక్షన్ కింద మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఎంపీగా సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో రాజమండ్రి డివిజన్ ఉపాధ్యక్షులు ఐవీ సుధాకర్, వీవీ రమణ, గౌతమ్, ఆంజనేయులు, మల్లేశ్వరరావు, ఏజెంట్స్ యూనియన్ నాయకులు రాంప్రసాద్, ధనుష్యులు ఉన్నారు.

అవినీతిపై చర్యలు తీసుకోవాలి

ఏలూరు (టూటౌన్): పోణంగి కంపోస్టు యార్డు పనుల పేరుతో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ డిమాండ్ చేశారు. స్థానిక పవర్ పేటలోని సీపీఎం కార్యాలయంలో ఏలూరు నగర కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. కార్పొరేషన్‌లో ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకోవాలని కిషోర్ కోరారు. పార్టీ నగర సభ్యులు వి.సాయిబాబు, బి.జగన్నాథరావు, కె.రామాంజనేయులు, వీవీవీఎన్ ప్రసాద్, జి.రవి కిషోర్, వైఎస్ కనకారావు, ఎం అరుణకుమారి పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల వినియోగంతో అన్నీ అనర్థాలే



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి నాగ రంజిత్ కుమార్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మాదకద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తికి శారీరక, మానసిక, సాంఘిక సమస్యలు తలెత్తుతాయని జూనియర్ సివిల్ జడ్జి పీవీ నాగ రంజిత్ కుమార్ అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక నరసింహారావుపేటలోని ఎస్‌వీఆర్‌కే కళాశాలలో మాదకద్రవ్యాలు, ర్యాగింగ్ వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థులపై మాదకద్రవ్యాల ప్రభావం ఎక్కువగా ఉందని, విద్యార్థులు అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా మెలగాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు మంచి నడవడికతో చదువు పట్ల శ్రద్ధ చూపాలన్నారు. మాదకద్రవ్యాలను ఉపయోగించడం వల్ల వ్యక్తిగతం కాకుండా కుటుంబ పరంగా సామాజిక పరంగా ఎంతో నష్టం కలుగుతుందని హెచ్చరించారు. ట్రైనీ జడ్జి లక్ష్మీ లావణ్య మాట్లాడుతూ విద్యార్థులు స్నేహభావంతో మెలగాలని, తోటి విద్యార్థుల మనోభావాలు దెబ్బతినకుండా నడుచుకోవాలని సూచించారు. ర్యాగింగ్ వంటి సమస్యలు ఎదురైనప్పుడు ఉపాధ్యాయులతో, తల్లిదండ్రులతో తెలియపరచాలని, సమస్యను దాచుకోవడం వల్ల మానసికంగా కుంగిపోవాల్సి వస్తుందని తెలిపారు. ఒకసారి రాగింగ్‌కు పాల్పడిన వ్యక్తిని కళాశాల నుంచి తొలగించడమే కాకుండా చట్టం కఠినంగా శిక్షిస్తుందని హెచ్చరించారు. విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధతో స్నేహభావంతో మెలగాలని సూచించారు. సదస్సులో ట్రైనీ జడ్జి ఎం రాజరాజేశ్వరి తేజస్విని పాల్గొన్నారు.

అణగారిన జాతుల అస్తిత్వాన్ని నిలబెట్టాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అణగారిన జాతుల అస్తిత్వాన్ని నిలబెట్టడానికి, లిపి లేని భాషల మౌఖిక సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకురావడానికి పత్రికలు, గ్రంథాలు విరివిగా రావాల్సిన అవసరం ఉందని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు పిలుపు నిచ్చారు. స్థానిక అశోక్‌నగర్‌లో శుక్రవారం బంజారా భజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో బంజారా క్రాంతి అంతర్జాల మాస పత్రిక జూలై నెల సంచికను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బంజారా క్రాంతి పత్రిక సంపాదకుడు భూక్యా నాగరాజు నాయక్, బంజారా బజరంగీ భేరి సంఘ జిల్లా నాయకులు ధరావత్ శ్రీనివాస్ నాయక్‌లు మాట్లాడారు. జిల్లా రచయితల సంఘం కార్యదర్శి నాగాస్త్ర తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే



18వ డివిజన్ ఇందిరమ్మ కాలనీలో మెయిన్ రోడ్డుపై వర్షం నీటిలో సైకిల్‌పై వెళుతున్న బాలుడు



రోడ్డుపై నిలిచిన నీటిలో అవస్థలు పడుతున్న ద్విచక్ర వాహనచోదకుడు



రోడ్డుపై గుంటలో నిలిచిన నీరు



ఇందిరమ్మ కాలనీలో ప్రధాన రహదారిపై వర్షం నీరు నిలిచిపోయి రాళ్లు పైకి తేలిన దృశ్యం

ఏలూరు (టూటౌన్): ఏలూరు 18వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ ప్రధాన రోడ్డు చినుకులు పడితే చాలు చిత్తడిగా మారుతుంది. కొద్దిపాటి వర్షానికే వర్షం నీరు రోడ్డుపై నిలిచిపోవడంతో స్థానికులు, ముఖ్యంగా విద్యార్థులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై ఏర్పడిన గోతులతో ద్విచక్ర వాహనచోదకులు, ఆటోలు, సరుకు రవాణా దారులు హడలి పోతున్నారు. మురుగు నీటిలో ప్రయాణం చేయడం వల్ల అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని భయాందోళన చెందుతున్నారు. పక్క జిల్లాలో అక్కడక్కడా డయేరియా కేసులు నమోదు కావడంతో ఇక్కడి ప్రజలు హడలిపోతున్నారు. ఇప్పటికైనా ఏలూరు కార్పొరేషన్ అధికారులు స్పందించి రోడ్డు పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శనివారపుపేట విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో సీట్లు



బివిఎస్ అన్వేష్



సాయిచరణ్ షణ్ముఖ్



ఎం మహేష్‌బాబు



సాయి వెంకట్‌తరుణ్

ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ మండలం శనివారపుపేట జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన నలుగురు విద్యార్థులు నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారని హెచ్ఎం జి.ప్రకాష్‌రావు చెప్పారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో మురాల మహేష్ బాబు, సాయివెంకట తరుణ్, సాయిచరణ్ షణ్ముఖ్, బీవీఎస్ అన్వేష్ మండల స్థాయిలో అధిక మార్కులు సాధించారని తెలిపారు. వీరు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించి తోటి విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారని కొనియాడారు. వీరితో పాటు స్పోర్ట్స్ కోటాలో మరో ఇద్దరు విద్యార్థులు సీట్లు సాధించే అవకాశం ఉందన్నారు. గతంలో సైతం శనివారపుపేట పాఠశాల నుంచి పలువురు బాలికలు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించి పాఠశాలకు పేరు తీసుకొచ్చారని గుర్తు చేశారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా శనివారపుపేట పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని చెప్పారు. విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

మానవత ఆర్థిక సాయం

పెదపాడు: అప్పనవీడుకు చెందిన మానవత శాఖ ప్రతినిధులు ఓ తాపీ కార్మికునికి ఆర్థిక సాయం అందించారు. కూలిపనికి ఆటోలో వెళ్తున్న శ్రీనివాసరావు ప్రమాదానికి గురై కాలికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స పొందుతున్నాడు. దీంతో మానత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు సభ్యులతో కలిసి వెళ్లి సంస్థ తరపున రూ.5వేలు, సభ్యులు 3,500 ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యుడు గూడపాటి జయరామచంద్రరావు, నారగాని కొండలరావు, వేగిరెడ్డి సూర్యనారాయణ, వడ్డి రాజేశ్వరరావు, సుభాచారి, పీవీ చలం, దయాల ప్రభాకరరావు, జన్యావుల సత్యనారాయణ పాల్గొన్నారు.

రైతులపై విద్యుత్ భారం మోపితే ప్రతిఘటిస్తాం

ఉంగుటూరు: రైతులపై విద్యుత్ భారం మోపితే ఏపీ రైతు సంఘం ప్రతిఘటిస్తుందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య తెలిపారు. కైకరంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు, ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా విద్యుత్ రంగంలో విధానాలను రూపొందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు పాల్గొన్నారు.

బాధితునికి ఆర్థిక సాయం



బాధితునికి ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): పెదవేగి మండలం భోగాపురం గ్రామానికి చెందిన నర్ని కొండయ్య యాదవ్‌కు చెందిన గడ్డి ట్రాక్టర్ ఇటీవల కరెంట్ వైర్లు తగిలి దగ్ధమైంది. ఈ ప్రమాదంలో గడ్డి లోడ్‌తో సహా ట్రాక్టర్ ట్రక్కు, ట్రాక్టర్ పూర్తిగా కాలి బూడిదై కొండయ్యకు తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో శుక్రవారం సాయంత్రం ఏలూరు జిల్లా యాదవ సంఘం కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ముమ్మిడి చింతయ్య ఆధ్వర్యంలో కొండయ్యకు రూ.10 వేలు సాయం అందించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు చిదరబోయిన శ్రీనివాసరావు, ఉక్కుసూరి గోపాలకృష్ణ, కిలారపు శ్రీనివాసరావు, గొర్ల రామారావు, బొట్టా అజయ్ కుమార్, భోగాపురం పంచాయతీ సర్పంచ్ దిమ్మిటి రమేష్, చిట్టిబోయిన సాయిబాబు, కొట్టి నాగభూషణం, భోగాపురం నాయకులు వీర్ల శరత్,నర్ని విష్ణు, కొక్కిరపాడు నాయకులు కొలుసు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన నీటి ద్వారా ఆరోగ్యం

భీమడోలు: స్వచ్ఛమైన నీటి ద్వారానే సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని జల్‌జీవన్ మిషన్ ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా కోఆర్డినేటర్ ఏ.శ్రీనివాసరావు అన్నారు. గుండుగొలను–1 ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. డయేరియా రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా గ్రామ పురవీధుల్లో చిన్నారులు, వివిధ శాఖల సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. తొలుత పాఠశాలను సందర్శించి ఆయన పాఠశాల పరిసరాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణను పరిశీలించారు. పాఠశాలలోని ఆర్వో ప్లాంట్, మరుగుదొడ్ల నిర్వహణ, విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకున్న తీరు తదితర అంశాలను పరిశీలించారు. కలుషిత నీరు, ఆహారంతో రోగాల బారిన పడతామని శ్రీనివాసరావు అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతలను పాటించాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, వివిధ శాఖల సిబ్బందితో కలిసి డయేరియాను నివారిద్దామంటూ నినదిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.


ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి హానికరం



దెందులూరు నర్సింగ్ కళాశాలలో పేపర్స్ బ్యాగ్స్‌డే నిర్వహిస్తున్న దృశ్యం

దెందులూరు: ప్లాస్టిక్ బ్యాగుల వినియోగం పర్యావరణానికి ఎంతో హానికరమని దెందులూరు నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. శుక్రవారం దెందులూరు నర్సింగ్ కళాశాలలో నేషనల్ పేపర్స్ బ్యాగ్స్ డే నిర్వహించారు. ప్లాస్టిక్ సంచులు భూముల్లోనే ఉండటం వల్ల నేల, నీరు కలుషితమవుతుందన్నారు. వీటికి బదులుగా కాగితపు సంచులు వినియోగించాలన్నారు. కాగిత సంచులు రీసైక్లింగ్ ద్వారా మళ్లీ పునర్వినియోగానికి ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థులు పేపర్ సంచులను తయారు చేసి నమూనాలను ప్రదర్శించారు.

పరశురామావతారంలో జగన్నాథుడు



ద్వారకాతిరుమల: పరశురామావతారంలో జగన్నాథుడు శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని జగన్నాథ స్వామి ఆలయంలో రథోత్సవాలు నేత్రపర్వంగా నిర్వహించారు. అందులో భాగంగా స్వామి వారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఈ క్రమంలో ఒక చేత్తో గండ్ర గొడ్డలి, మరో చేత్తో కమండలం, పాత్రను పట్టుకుని ఉన్న పరశురాముడి అవతారం భక్తులకు కనువిందు చేసింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఆయిల్‌పామ్ సాగు అభివృద్ధికి సహకరించండి

దెందులూరు : దెందులూరు నియోజకవర్గం పూర్తిగా వ్యవసాయ ఆధారిత ప్రాంతమని రెండవ పంటగా ఈ నియోజకవర్గంలో రైతులు ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్‌కు బీజేపీ దెందులూరు మండల అధ్యక్షుడు బుజ్జి గోపాల్ వినతి పత్రం అందజేశారు. ఆయిల్‌పామ్ సాగులో సమస్యల పరిష్కారం, ప్రోత్సాహకరమైన రేటు, రవాణాపరమైన అన్ని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు. ఎంపీ సానుకూలంగా స్పందించారని గోపాల్ తెలిపారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	33
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	19
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	32

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	19
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	29
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	26
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	27
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	28
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	29
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	19
ఏలూరు - తిరుపతి	16.00	4830	29

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	50	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	84
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	36	ములక్కాడలు	10, 12
బెండకాయలు	36	కంద	60
పచ్చిమిర్చి	36	బీట్‌రూట్	36
కాకర కాయలు	44-64	కీరా దోస	48-56
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	90
బీరకాయలు (పందిరి)	40	అల్లం	180
క్యాబేజీ	36	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	34-50	పాలకూర	12
దొండకాయలు	34	చుక్కకూర	12
బంగాళదుంపలు	40	తోటకూర	10
ఉల్లిపాయలు	40	గోంగూర	07
గోరుచిక్కుడు	56	పుదీనా	05
దోసకాయలు	20	బఠాణి	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	90
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	44